క్లుప్తంగా

ఏపీ ఐడీసీఎల్ అభివృద్ధికి కృషి చేస్తా



భవానీపురం(విజయవాడపశ్చిమ):ఆంధ్ర ప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఐడీసీ) లిమిటెడ్ చైర్‌పర్సన్ బండి పుణ్యశీలరాజ్‌కుమార్ పదవీ కాలాన్ని పొడిగించిన సందర్భంగా సంస్థ డైరెక్టర్లు ఆమెను అభినందించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఆమె చాంబర్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన సమావేశంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన పలువురు డైరెక్టర్లు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ ఐడీసీఎల్ చైర్‌పర్సన్ బండి పుణ్యశీల రాజ్‌కుమార్ మాట్లాడుతూ పదవీ కాలం పూర్తయినప్పటికీ తనపై నమ్మకం ఉంచి పొడిగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సదా రుణపడి ఉంటానని అన్నారు. అలాగే తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ సంస్థ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

28న ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన వాహనాల వేలం

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఈ నెల 28వ తేదీ వేలం వేయనున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ పి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు కార్లు, ఒక ఆటో, రెండు ద్విచక్రవాహనాలకు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు మూడు, నాలుగు చక్రాల వాహనాలకు రూ.10 వేలు, ద్విచక్రవాహనాలకు రూ.5 వేలు చొప్పున ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (రిఫండబుల్) కట్టి వేలంలో పాల్గొనాలని కోరారు. వేలంలో పాడుకున్న నగదుకు అదనంగా 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వేలంకు సంబంధించిన పూర్తి వివరాలకు ఎస్ఈబీ భవానీపురం స్టేషన్ ఎస్ఐ పి.వంశీరామ్ 9182979919, కానిస్టేబుల్ సీహెచ్ సుబ్రహ్మణ్యం 8074269210 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు

అన్న ప్రసాదాన్ని వృథా చేయకండి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దుర్గమ్మ సన్నిధిలో రాత్రి వేళ నిద్ర చేసే భక్తులకు పంపిణీ చేసే అన్న ప్రసాదాన్ని వృథా చేయరాదని చైర్మన్ కర్నాటి రాంబాబు తెలిపారు. మహామండపం గ్రౌండ్ ఫ్లోర్‌లో రాత్రి జరిగే అన్న ప్రసాద వితరణను దుర్గగుడి చైర్మన్ శుక్రవారం పరిశీలించారు. అన్న ప్రసాద నాణ్యతను పరిశీలించడంతో పాటు భక్తుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాలు వృథా చేయవద్దని, భక్తులందరికీ అన్న ప్రసాదం అందేలా ఆలయ అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.

జగనన్న ప్రభుత్వం బాగుండాలని ప్రార్థనలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రానున్న ఎన్నికల్లో మరోసారి విజయం సాధించాలని కోరుతూ రాజస్థాన్‌లోని అజ్మీర్ బాబా సన్నిధిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు వక్ఫ్‌బోర్డు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు షేక్ గౌస్‌మొహిద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం రాజస్థాన్‌లోని అజ్మీర్ షరీఫ్‌లోగల దేశంలోనే ప్రఖ్యాత గాంచిన ఖ్వాజా మొయినుద్దీన్ చిస్తీ అవులియా బాబా దర్గాలో జగన్‌మోహన్‌రెడ్డి కోసం స్థానిక ముజావర్లతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి, అనంతరం బాబాకు చాదర్‌ను సమర్పించినట్లు పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వం దేశంలోనే అత్యున్నతమైన సంక్షేమ పాలనతో, సంస్కరణలతో రోల్ మోడల్‌గా దూసుకుపోతోందన్నారు. రాష్ట్ర ప్రజలకు మరింత సేవలందించేందుకు జగనన్నకు శక్తిని ఇవ్వాలని కోరుతూ ప్రార్థనలు చేశామన్నారు.

మధురంగా శాస్త్రీయ సంగీత కచేరీలు



విజయవాడ కల్చరల్: స్వరఝరి సంగీత సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ షష్టిపూర్తి సందర్భంగా మూడు రోజులపాటు నిర్వహించే సంగీత మహోత్సవాలు లబ్బీపేట శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్వాంసులు, వాగ్గేయకారులు త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, స్వాతి తిరునాళ్, అన్నమయ్య, రామదాసు, రచించి స్వరపరచిన కీర్తనలు ఆలపించారు. టి.రుక్మిణీ కృష్ణ తిరుచ్చినాపల్లి, ఎస్‌పీ రాగమయూరి అబుదాబీ, లోళ్ళ జయరాం, శివలెంక విశ్వనాథ్, వలివేటి నీరజ, ఎం.హరిప్రియ, లంక తేజస్వి సంప్రదాయ కీర్తనలు ఆలపించారు.

ప్రజలకు మేలు చేసేందుకే జగనన్న సురక్ష

ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి



53వ డివిజన్‌లో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ రాయన భాగ్యలక్ష్మి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):ప్రజలకు మేలు చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 53వ డివిజన్‌లో జగనన్న సురక్ష శిబిరం చేపలమార్కెట్ వద్ద ఉన్న సచివాలయం ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. 54వ డివిజన్‌కు సంబంధించిన శిబిరం వించిపేట గాంధీబొమ్మ సెంటర్ సమీపంలోని సచివాలయం ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా హాజరైన వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా పేదలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. అర్హత కలిగిన అందరికీ అన్నీ ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రజలకు అన్ని రకాలుగా మేలు చేయాలనే లక్ష్యంతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జగనన్న సురక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు సంబంధించి ఏదైనా ధ్రువీకరణ పత్రం సకాలంలో అందక సంక్షేమ కార్యక్రమాలు దూరం కాకూడదనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

పవన్‌కల్యాణ్ సంఘవిద్రోహి...

పవన్‌కల్యాణ్ సంఘవిద్రోహిగా ప్రజలందరూ భావిస్తున్నారని శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. వలంటీర్లపై ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడుతున్న పవన్‌ని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. తప్పుడు మాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్న వ్యక్తి పవన్ అని ధ్వజమెత్తారు. పవన్‌కళ్యాణ్ మాటలు మోసపూరితమైనవని దుయ్యబట్టారు. గతంలో చంద్రబాబు ఓటర్ల డేటాని మార్పులు చేసినప్పుడు పవన్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ప్రభుత్వంపై తప్పుడు మాటలు మానుకోవాలన్నారు. పవన్‌కళ్యాణ్‌కు దమ్ముంటే 175 నియోజకవర్గాల్లో పోటీ చేయాలని తెలిపారు. పగలు బీజేపీతో రాత్రికి టీడీపీతో ఉండే పవన్‌కళ్యాణ్ మాటలు హేయమన్నారు. కార్పొరేటర్లు మహాదేవు అప్పాజీరావు, అబ్దుల్ ఆర్షద్, ఏపీ జైన కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, నాయకులు విశ్వనాథ రవి, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు నగర పాలక సంస్థ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ పెద్ద రాజకీయ అజ్ఞాని

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు మతిభ్రమించి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ దుయ్యబట్టారు. పవన్‌కల్యాణ్ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేస్తున్న దిగజారుడు వ్యాఖ్యలను ఆసిఫ్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వించిపేటలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. పవన్‌కల్యాణ్ పెద్ద రాజకీయ అజ్ఞాని అని విమర్శించారు. చంద్రబాబుకు ఊడిగం చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చిన పవన్‌కల్యాణ్ రాష్ట్ర ప్రజల మనస్సులను గెలుచుకున్న జగన్‌మోహన్‌రెడ్డిపై నోటికొచ్చినట్లు మాట్లాడటం దుర్మార్గమన్నారు. గత ఎన్నికల్లో రెండు చోట్ల నిలబడి డిపాజిట్లు కూడా రాని ఆయన దేశంలోనే అత్యధిక మెజార్టీ ఓట్లతో ఎంపీగా, ఎమ్మెల్యేగా గెలుపొందిన జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ముఖ్యంగా 50 శాతానికి పైగా ఓట్లతో గెలుపొందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని తరిమికొడతానంటూ పవన్ కల్యాణ్ మాట్లాడుతుంటే రాష్ట్ర ప్రజలు నవ్వుకుంటున్నారని చెప్పారు. మహిళల పట్ల ఏ మాత్రం గౌరవం లేని పవన్‌కల్యాణ్ వలంటీర్లలో 60 శాతానికి పైగా ఉన్న మహిళలను, అందులోనూ అత్యధికంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాలను నోటికొచ్చినట్లు మాట్లాడటం సిగ్గు చేటన్నారు. పవన్‌కల్యాణ్‌కు బుద్ధి చెప్పటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. గౌరవ ముఖ్యమంత్రిని ఏకవచనంతో మాట్లాడటమే కాకుండా కేంద్ర నిఘావర్గాలు చెప్పాయంటూ సొల్లుకబుర్లు చెబుతున్న పవన్ కల్యాణ్ దమ్ముంటే రాష్ట్రంలో ఒంటరిగా, 175 నియోజకవర్గాల్లో పోటీ చేసి తన సత్తా చూపించాలన్నారు. మరోసారి ముఖ్యమంత్రిపై విమర్శలు చేస్తే ప్రజలు సహించరన్నారు.

మహిళల పట్ల గౌరవంగా మెలగాలి



చిట్టినగర్(విజయవాడపశ్చిమ):మహిళ ప్రయాణికుల పట్ల గౌరవంగా ఉండటంతో పాటు ఆటోకు సంబంధించిన రికార్డులన్నీ ఎప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటో యజమానులు, డ్రైవర్లతో సీఐ సుబ్రహ్మణ్యం రైల్వే స్టేషన్ వెస్ట్ బుకింగ్ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్లో సమావేశమయ్యారు. ఆటోకి సంబంధించిన రికార్డులన్నీ ఫోన్‌లో ఉంచుకోవాలని, మైనర్లకు ఆటోలు అద్దెకు ఇవ్వడం నేరమని తెలిపారు. ఏదైనా ప్రమాదం జరిగితే డ్రైవర్‌తో పాటు ఆటో యజమాని బాధ్యులవుతారని హెచ్చరించారు. అదే విధంగా రాత్రి వేళలో రైల్వే స్టేషన్, బస్టాండ్‌కు వెళ్లే సమయంలో మహిళా ప్రయాణికుల పట్ల మర్యాద పూర్వకంగా మెలగాలని చెప్పారు. ఆటోలో ఏదైనా మర్చిపోతే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో అందించి బాధితులకు చేరేలా చూడాలన్నారు.

కొండ ప్రాంతంలో నీటి సమస్యను పరిష్కరిస్తాం



వాటర్ ట్యాంక్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న మాధురి లావణ్య, అధికారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక 45వ డివిజన్ పరిధిలోని కొండ ప్రాంతం చివరి వరకు తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య తెలిపారు. వాటర్ ట్యాంక్ నిర్మించేందుకు రామలింగేశ్వర స్వామి గుడి వద్ద గల స్థలాన్ని డీఈ శివాజి, వాటర్ సప్‌లై ఏఈ ఎస్. అహ్మద్‌తో కలిసి శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాధురి లావణ్య మాట్లాడుతూ తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. దీంతో స్థానిక శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావుకు చెప్పటంతో ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించే ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి కొండ ప్రాంతవాసుల మంచినీటికి అవస్థలు పడకుండా చూడాలని ఆదేశించారన్నారు. ఆయన ఆదేశాల మేరకు వచ్చిన అధికారులతో కలిసి వాటర్ ట్యాంక్ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్నామన్నారు. స్థలాన్ని ఖరారు చేసిన తరువాత ఎస్టిమేషన్ వేయించి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ద్వారా నిధులు మంజూరు చేయించి సాధ్యమైనంత త్వరలో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను మొదలు పెడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు బైపినేని కోటేశ్వరరావు, పీతల నాగు, నల్లం వాసు, దబ్బాడ రాము పాల్గొన్నారు.

రైల్వే పారిశుద్ధ్య కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):అకారణంగా తొలగించిన రైల్వేస్టేషన్‌లోని పారిశుద్ధ్య కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లో తీసుకోవాలని రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నగర కార్యదర్శి ఈవీ నారాయణ డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిరసిస్తూ శుక్రవారం కార్మికుల మస్టర్ పాయింట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ రక్షక్ కాంట్రాక్టు సంస్థ నిర్దాక్షిణ్యంగా కార్మికులను తొలగించి వారిని రోడ్డు పాలు చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ తన లాభాల కోసం కార్మికుల కడుపులు కొట్టే పద్ధతి మార్చుకోవాలని కోరారు. రైల్వే అధికారులు కూడా ఈ సమస్యపై స్పందించి కార్మికులందరినీ పనిలోకి పెట్టించే చర్యలు చేపట్టి కార్మికులకు న్యాయం చేయాలని విన్నవించారు. సీఐటీయూ నగర నాయకులు కె. సూరిబాబు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థినికి ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న బలరామకృష్ణ

సత్యనారాయణ(విజయవాడసెంట్రల్):విద్యార్థుల భవిష్యత్తుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకి కాకూడదని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య గౌరవ అధ్యక్షుడు కొప్పవరపు వెంకట బలరామకృష్ణ తెలిపారు. సత్యనారాయణపురంలోని శృంగేరిపీఠంలో బలరామకృష్ణమూర్తి దంపతుల చేతుల మీదుగా ఇంజినీరంగ్ చదువుతున్న విద్యార్థినికి శుక్రవారం రూ. 40,647 ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థినికి చేయూత అందించే ఉద్దేశంతో అమెరికాలో నివాసముంటున్న డాక్టర్ కాత్రపాటి సుబ్బరాయశర్మ ఆర్థిక సాయంతో చెక్కును అందజేసినట్లు తెలిపారు. పేదరికంతో ఉన్నత చదువులు చదవలేని విద్యార్థులకు బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో శృంగేరి శారదాపీఠ ధర్మాధికారి బీవీ చలపతిరావు, బ్రాహ్మణ బిజినెస్ నెట్‌వర్క్ ప్రతినిధి మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ధర్మపథంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై శుక్రవారం విజయవాడకు చెందిన సీహెచ్ దీపాన్విత బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. రాజగోపురం ఎదుట కళావేదికపై దీపాన్విత బృందంలోని సాత్విక, ఉజ్వలసాయి, హాసిని, సింధూజ, నిందిత, జ్ఞానదీపికలు పలు కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేశారు. అనంతరం నృత్యకారులకు అమ్మవారి దర్శనం కల్పించిన దేవస్థాన అధికారులు ప్రసాదాలను అందచేశారు.

220 మందికి ఉచిత వైద్య పరీక్షలు



పరీక్షలు చేస్తున్న డాక్టర్లు పవన్‌కుమార్, మానస

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ ఐరన్ అండ్ హార్డ్‌వేర్ మర్చంట్స్ అసోసియేషన్, మానస హాస్పటల్స్ ఆధ్వర్యంలో శుక్రవారం భవానీపురం ఐరన్ కాంప్లెక్స్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జీర్ణకోశ వ్యాధుల నిపుణులు డాక్టర్ నూరె పవన్‌కుమార్, మానసిక వ్యాధుల నిపుణులు డాక్టర్ ఆర్‌కే అయోధ్య, చైల్డ్ అండ్ అడల్ట్స్ సైకియాట్రిస్ట్ డాక్టర్ మానస కాజలు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నూరె పవన్‌కుమార్ మాట్లాడుతూ జీర్ణకోశ వ్యాధులను అశ్రద్ధ చేయకుండా తగు వైద్యం పొందుతూ, జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రస్తుతం ఆహారపు అలవాట్లు జీవనశైలిలో ఎక్కువ మంది జీర్ణకోశవ్యాధుల బారిన పడుతున్నట్లు పేర్కొన్నారు. మానసిక ఒత్తిళ్లు, వ్యాధులపై డాక్టర్ ఆర్కే అయోధ్య అవగాహన కలిగించారు. ఐరన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణయ్య, కార్యదర్శి కొనకళ్ల సూర్య శంకర్‌లు వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):యువకుడి వేధింపులు తాళలేక వివాహిత ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. అడ్డరోడ్డుకు చెందిన మహిళ ఇళ్లల్లో పని చేసుకుంటూ జీవిస్తుంది. కొంత కాలంగా ఆమెను సంతోష్ అనే యువకుడు వేధింపులకు గురిచేస్తున్నాడు. బాధలు తట్టుకోలేక ఆ మహిళ గురువారం రాత్రి ఎలుకల మందు తినింది. గమనించిన భర్త హుటాహుటిన ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

24 నుంచి ఇంటర్ తప్పిన విద్యార్థులకు ఉచిత శిక్షణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):కేబీఎన్ కళాశాలలో 2023 ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు తప్పిన విద్యార్థులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. కళాశాల ప్రాంగణంలో ప్రత్యేక శిక్షణనిచ్చి వారిని పరీక్షలకు హాజరయ్యేందుకు సహకరిస్తామని పేర్కొన్నారు. ఈ శిక్షణను పూర్తిగా ఉచితంగా అందిస్తామని, ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేదన్నారు. తరగతులను 24వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం తొమ్మిదిన్నర గంటల నుంచి ప్రారంభమవుతాయని వివరించారు. మరింత సమాచారం కోసం ఫోన్ నెం 8919316615కు సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ):భవానీపురం పరిధిలో గల 11 కేవీ మసీదు ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో శనివారం రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు భవానీపురం అల్లుడి పేట, బ్యాంక్ సెంటర్, సుధాకర్ మెడికల్ షాప్ రోడ్, రాజేంద్ర వీధి, నాగార్జున వీధి, మసీదు రోడ్, రంగూన్ సాహెబ్ వీధి, కరకట్ట, ఆలివ్ ట్రీ హోటల్ వెనుక వైపు, రీజనల్ సైన్స్ సెంటర్ ఏరియాల్లో కరెంట్ నిలిపివేయనున్నట్లు వివరించారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

డివిజన్ల అభివృద్ధికి నిరంతర కృషి

స్థాయీ సంఘం సమావేశంలో మేయర్ భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు):విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని ఆయా డివిజన్ల అభివృద్ధికి తాము నిరంతరం కృషి చేస్తున్నామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో మేయర్ అధ్యక్షతన శుక్రవారం స్థాయీ సంఘం సమావేశం నిర్వహించారు. మొత్తం 26 అంశాలు ఎజెండాలో పొందుపరచగా అందులో 20 ఆమోదించారు. మూడు ర్యాటిఫై చేశారు. ఒక అంశాన్ని వాయిదా వేయగా, ఒకటి రికార్డు, మరొక అంశాన్ని ధ్రువపరుస్తూ తీర్మానించారు. స్థాయీ సంఘం సభ్యులతోపాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రధానాంశాలు ఇవే...

- నగరంలోని ప్రధాన కూడళ్లు, ఆయా ప్రాంతాల్లో గ్రీనరీని పెంపొందించేందుకు 2023-24 ఏడాదికి ఎవెన్యూ ప్లాంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా ట్రీగార్డులు, స్టాకింగ్ స్టిక్స్, ఎరువుల కొనుగోలుకు రూ. 25 లక్షలతో అంచనాలు రూపొందించారు. వాటిని వీఎంసీ సాధారణ నిధుల నుంచి వినియోగించుకునేందుకు ప్రతిపాదన రాగా సభ్యులు ఆమోదిస్తూ తీర్మానం చేశారు.
- సర్కిల్-1 పరిధిలోని 54వ డివిజన్‌లోని విచిపేట ఇఫెన్‌స్టీట్ నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు రూ. 43.78 లక్షల నిధులు ఖర్చుకు వచ్చిన ప్రతిపాదనను స్థాయీ సంఘం సభ్యులు ఆమోదం తెలిపారు.
- సర్కిల్-3 పరిధిలోని 3వ డివిజన్‌లో గణేష్‌నగర్ కాలనీలో 8, 8ఏ, 11 అంతర్గత రోడ్ల నిర్మాణానికి రూ. 39.50 లక్షల నిధులు వెచ్చించేందుకు వచ్చిన ప్రతిపాదనను ఆమోదిస్తూ తీర్మానం చేశారు.
- వీఎంసీ ఇంజినీరింగ్ వర్క్స్ డివిజన్-2లో 2021 ఫిబ్రవరి 1 తేదీ నుంచి ఈ ఏడాది మే 31వ తేదీ వరకు 54 పనులు అత్యవసరంగా నామినేషన్ పద్ధతిలో పనుల కేటాయింపులు, బిల్లుల చెల్లింపులకు వచ్చిన ప్రతిపాదను కమిటీ సభ్యులు వాయిదా వేశారు.



స్థాయీ సంఘం సమావేశం నిర్వహిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

చెత్త సేకరణలో అలసత్వం వద్దు

కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



చెత్త సేకరణ పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు):చెత్త సేకరణలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. సర్కిల్-3 పరిధిలోని 5 వ డివిజన్ క్రీస్తురాజుపురం అమ్మ కళ్యాణ మండపం వద్ద శుక్రవారం ఆయన పర్యటించారు. కొన్నిచోట్ల చెత్త తొలగింపులో సిబ్బంది అలసత్వాన్ని గుర్తించి , స్థానికంగా విధులు నిర్వహిస్తున్న కార్మికులు, శానిటరీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వారికి ఆయన మెరుగైన పారిశుధ్య నిర్వహణ కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. బిన్ ఫ్రీ సిటీలో భాగంగా నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డంపర్ బిన్నులను తొలగించామని చెప్పారు.

ప్రతి ఒక్కరూ ఇంటి నుంచే తడి, పొడి చెత్తను విభజించి కార్మికులకు అందిచేలా స్థానికులకు చైతన్యపరచాలని సూచించారు. సచివాలయ పరిధిలో జరుగుతున్న శానిటేషన్ పనుల గురించి చెత్త సేకరణకు శానిటేషన్ సిబ్బంది ప్రతి ఇంటికి వస్తుందీ... లేనిదీ అక్కడి ప్రజలను అడిగి తెలుసుకొన్నారు. వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగర వ్యాప్తంగా ఉన్న అన్ని కాలువల్లో పూడికతీత పనులను క్రమం తప్పకుండా తీయాలని ఆదేశించారు.

మల్లేశ్వరస్వామి ఆలయ పనుల పరిశీలన



ఆలయ పనులు పరిశీలిస్తున్న ఈవో భ్రమరాంబ, ఇంజనీరింగ్ అధికారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):మల్లేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాణ పనులను శుక్రవారం అధికారులు పరిశీలించారు. దుర్గగుడి ఈవో భ్రమరాంబ, ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమాలతో పాటు వైదిక కమిటీ సభ్యులు మల్లేశ్వరాలయానికి చేరుకుని ఆలయ శిఖరం పనుల గురించి కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. రానున్న దసరా, కార్తీక మాసం నాటికి స్వామి వారి దర్శనం కలిగేలా ఆలయ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే ఆలయ శిఖర పనులు పూర్తి కానున్న నేపథ్యంలో ఆలయం చుట్టూ ఏర్పాటు చేసే విగ్రహాల తయారీని ఆదివారం వెళ్లి పరిశీలించాలని నిర్ణయించారు. ఆలయ స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు మారుతీ యజ్ఞనారాయణ శర్మ, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు. తిరుపతి సమీపంలోని శిల్పశాలను ఆదివారం దుర్గగుడి అధికారులు సందర్శించాలని భావిస్తున్నారు.

ఇప్పటికే దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు తిరుమలలో ఉండగా, ఆదివారం ఈవో భ్రమరాంబ, ఈఈ కోటేశ్వరరావు, ఎల్. రమాలతో పాటు కాంట్రాక్టర్, ఇతర అధికారులు అక్కడకు చేరుకుని శిల్పాలను పరిశీలిస్తారు.

మణిపూర్‌లో మారణకాండ ఆపాలి



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండను ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనలకు వ్యతిరేకంగా సీపీఎం పశ్చిమ నగర కమిటీ ఆధ్వర్యంలో ఆంజనేయవాగు సెంటర్‌లో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ మణిపూర్ ఘటనలకు బీజేపీ ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు. రేపిస్టులకు కేంద్రం రక్షణ కల్పిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ ఐక్యత విచ్ఛిన్నం చేసే మతోన్మాద రాజకీయాలను కేంద్రం ప్రోత్సహిస్తుందని ధ్వజమెత్తారు. పార్లమెంట్‌లో మణిపూర్‌పై చర్చకు మోడీ ప్రభుత్వం భయపడుతుందన్నారు. మణిపూర్ మంటల్ని చలార్చే విధంగా ప్రధాని మాట్లాడకపోవటం అక్కడ పర్యటించకపోవడం దేశద్రోహ చర్య అన్నారు. మణిపూర్‌లో శాంతి సామరస్యాన్ని నెలకొల్పే విధంగా భారతీయులందరూ ముక్తకంఠంతో నినదించాలన్నారు. మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసిన నిందితుల్ని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నగర కమిటీ కార్యదర్శి బోయి సత్యబాబు నాయకులు కే సూరిబాబు, ఈవీ నారాయణ, పి.రాజు, పి.రాజేష్, దుర్గా, ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో ధ్వంసంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): దాడికి పాల్పడటమే కాకుండా ఆటోను ధ్వంసం చేసిన ముగ్గురిపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. జక్కంపూడి వైఎస్సార్ కాలనీ బ్లాక్ నెం 148కి చెందిన పట్నాల సాయికుమార్ ఆటో నడుపుకుని జీవనం సాగిస్తుంటాడు. కాలనీలోని 5వ బ్లాక్‌లో నివాసం ఉండే సాయికుమార్ బావ ప్రసాద్ వాళ్ల తాత చనిపోవడంతో చూసేందుకు వెళ్లి మధ్యాహ్నం తిరిగి ఇంటికి వచ్చేశాడు. ఆ తర్వాత ప్రసాద్‌తో పాటు శ్రీను, అఖిల్ అనే వారు సాయి కుమార్ ఇంటికి వచ్చి నోటికి వచ్చినట్లు తిట్టడంతో ఎందుకు తిడుతున్నారని అడిగాడు. దీంతో సాయికుమార్ తల్లిని కూడా తిట్టడమే కాకుండా ఇంటి ముందు ఉన్న ఆటో అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.